


ESTD: 1999
www.voodayam.com

# వుదయం

సంపుటి : 27 సంచిక : 104 | హైదరాబాద్ | 16-06-2026 మంగళవారం
SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY
రూ. 3.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily
Simultaneously Published from Hyderabad, Adilabad, Karimnagar, Khammam, Guntur & Warangal
Follow us on




## ప్రజా ప్రభుత్వంలోనే విస్తరణకు

# వేగంగా అడుగులు

- వైఎస్ హయాంలో అంకురార్పణ.. కేసీఆర్ హయాంలో ఆలస్యం
- మెట్రోను స్వాధీనం చేసుకున్న రాష్ట్ర ప్రభుత్వం
- తక్కువ వడ్డీకే జపాన్ సంస్థ రుణం.. అడ్డుకున్న కిషన్ రెడ్డి

**రూ.15 వేల కోట్లకే దక్కించుకున్నాం**




**హైదరాబాద్, జూన్ 15 (వుదయం) :**

జంటనగరాలతో పాటు కోర్ పరిధిలోని ప్రజల రవాణా అవసరాలను తీర్చేందుకు అంతర్జాతీయ ప్రమాణాలతో మెట్రో విస్తరణను చేపట్టడమే తమ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత పాలకుల నిర్లక్ష్యం, ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ వివక్షపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. వైఎస్ హయాంలో అంకురార్పణ.. కేసీఆర్ హయాంలో ఆలస్యం గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే హైదరాబాద్ అభివృద్ధికి అంతర్జాతీయ ప్రణాళికలు జరిగాయని సీఎం గుర్తు చేశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా, జైపాల్ రెడ్డి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్న సమయంలోనే హైదరాబాద్‌కు మెట్రో ప్రాజెక్టు మంజూరైందని, రోశయ్య హయాంలో ఒప్పందాలు జరిగాయని తెలిపారు. 2017 నాటికే పూర్తి కావాల్సిన మొదటి దశ మెట్రోను.. తెలంగాణ వచ్చిన తర్వాత కేసీఆర్ చారిత్రక కట్టడాల సాకుతో మూడేళ్లు అడ్డుకున్నారని మండిపడ్డారు. దీనివల్ల రూ.15 వేల కోట్ల ప్రాజెక్టు వ్యయం రూ.22 వేల కోట్లకు చేరిందని, ఆలస్యం కావడం వల్ల ఎల్ అండ్ టీ (L&T) సంస్థ భారీ నష్టాల్లో కూరుకుపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం తమ ఆస్తులు పెంచుకోవడానికే చూసింది తప్ప, మెట్రో విస్తరణను పట్టించుకోకపోవడంతో హైదరాబాద్ మెట్రో దేశంలోనే 9వ స్థానానికి పడిపోయిందని విమర్శించారు.

**మెట్రోను స్వాధీనం చేసుకున్న రాష్ట్ర ప్రభుత్వం**

తాము అధికారంలోకి రాగానే మెట్రో ఫేజ్ 2 విస్తరణపై దృష్టి పెట్టామని, ప్రధానితో పాటు కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞప్తి చేశామని సీఎం తెలిపారు. అయితే, ఫేజ్ 1 నిర్మించిన ఎల్ అండ్ టీ సంస్థే ఫేజ్ 2 కూడా నిర్మించాలనే నిబంధనను కేంద్రం పెట్టిందని.. కానీ గత నష్టాల దృష్ట్యా తాము ఈ ప్రాజెక్టులో భాగస్వామ్యం కాలేమని, భవిష్యత్ నిర్వహణను కూడా చేపట్టలేమని ఎల్ అండ్ టీ స్పష్టం చేసిందని సీఎం వివరించారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకే.. ఏకైక ప్రత్యామ్నాయంగా రూ.30




వేల కోట్ల విలువైన ఎల్ అండ్ టీ మెట్రో ఆస్తిని కేవలం రూ.15 వేల కోట్లకే రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని వెల్లడించారు. తక్కువ వడ్డీకే జపాన్ సంస్థ రుణం.. అడ్డుకున్న కిషన్ రెడ్డి మెట్రో కోసం ఎల్ అండ్ టీ సంస్థ బ్యాంకుల నుండి రూ.13,600 కోట్లను 8.25 శాతం వడ్డీకి తెచ్చుకుందని, ఆ లోన్‌ను రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశామని సీఎం చెప్పారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వానికి ఎలాంటి గ్యారెంటీ లేకుండా పీఎఫ్‌సీ, ఆర్ఈసీల ద్వారా 9 నుండి 11.5 శాతం అధిక వడ్డీతో రూ.3 లక్షల 15 వేల కోట్ల అప్పులు ఇచ్చిన కేంద్రం.. ఇప్పుడు తమకు మాత్రం సహకరించడం లేదని ఆరోపించారు. తాము ఎంతో శ్రమించి జపాన్ సంస్థ ద్వారా కేవలం 4 శాతం వడ్డీకే రూ.13,600 కోట్ల రుణం ఐఆర్ఎఫ్‌సీ (IRFC) కి వచ్చేలా ఒప్పించామని, రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన రూ.1400 కోట్లు కూడా కట్టేశామని తెలిపారు. జపాన్ సంస్థ నిధులు విడుదల చేసినప్పటికీ.. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మే 20న కేంద్ర మంత్రి ఖట్టర్‌ను, మే 21న అశ్వినీ వైష్ణవ్‌ను కలిసి ఆ నిధులను రాష్ట్ర ప్రభుత్వానికి బదిలీ చేయవద్దని అడ్డుకున్నారని రేవంత్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. కిషన్ రెడ్డి అడ్డుకోవడం వల్లే తాము ఆయన వెంట పడాల్సి వస్తోందని, ఇవాళ నిధులు విడుదల కావాల్సిన బాధ్యత కిషన్ రెడ్డిదేనని స్పష్టం చేశారు. ఆ డబ్బులకు వడ్డీ ఎవరు కట్టాలో కిషన్ రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. ఆర్బీఐని ఒప్పించిన లేఖను ఇచ్చినప్పటికీ లోన్ ట్రాన్స్‌ఫర్ కాకుండా అడ్డుకోవడం దారుణమన్నారు.

**కేటీఆర్ కుట్రలకు కిషన్ రెడ్డి సహకారం**

కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి వెనక కేటీఆర్ ఉన్నారని, కేటీఆర్ చేసే కుట్రలకు కిషన్ రెడ్డి సహకరిస్తున్నారని సీఎం దుయ్యబట్టారు. గతంలో కేసీఆర్ ఇష్టమొచ్చినట్లు మాట్లాడినా పల్లెత్తు మాట అనని కిషన్ రెడ్డి.. తాము ఏమీ అనకపోయినా సవాళ్లు విసురుతున్నారని మండిపడ్డారు. అహ్మదాబాద్, ఉత్తరప్రదేశ్, వైజాగ్ నగరాలకు మెట్రోలు మంజూరు చేస్తున్న కేంద్రం.. తెలంగాణపై ఏ స్థాయిలో వివక్ష చూపుతుందో ప్రజలు గమనించాలన్నారు. సికింద్రాబాద్ ఎంపీగా ఉన్న కిషన్ రెడ్డి పరిధిలోనే మెట్రో విస్తరణ జరగాల్సి ఉందని, అయినా ఆయన బాధ్యత తీసుకోవడం లేదని ఎద్దేవా చేశారు.

**మీ భాగస్వామ్యం వద్దు.. NOC ఇవ్వండి!**

"కేంద్ర ప్రభుత్వానికి 50 శాతం భాగస్వామ్యం కష్టమనుకుంటే మాకు మీ నిధులు అవసరం లేదు. వెంటనే మాకు ఎన్‌ఓసీ (NOC) ఇవ్వండి. మెట్రో ఫేజ్ 2 మొత్తాన్ని రాష్ట్ర ప్రభుత్వమే పూర్తిగా భరించి నిర్మించుకుంటుంది" అని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టమైన సవాల్ విసిరారు. 122 కిలోమీటర్ల మెట్రో రెండో దశకు కేంద్రం భాగస్వామ్యం తీసుకుంటుందో లేదో, లేదంటే ఎన్‌ఓసీ ఇస్తుందో కిషన్ రెడ్డి తేల్చాలని డిమాండ్ చేశారు. తాము రాజకీయాల కోసం మాట్లాడటం లేదని.. మెట్రో మొదటి దశను పూర్తిగా స్వాధీనం చేసుకుని, రెండో దశను విజయవంతంగా పూర్తి చేయడమే తమ ప్రభుత్వ ఏకైక లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు.

# అంతర్జాతీయ మార్కెట్లే లక్ష్యం



- కేబినెట్ సబ్ కమిటీకి వ్యవసాయ నిపుణుల కీలక సూచన
- విదేశాల్లో తెలంగాణ బియ్యానికి ఫుల్ డిమాండ్
- ప్రజాభవన్ లో డిప్యూటి సీఎం భట్టి విక్రమార్క అధ్యక్షతన సబ్ కమిటి

**హైదరాబాద్, జూన్ 15 (వుదయం) :**

దేశీయ మార్కెట్లతో పాటు అంతర్జాతీయంగా విపరీతమైన డిమాండ్ ఉన్న ఎనిమిది రకాల మేలురకం వరి వంగడాల సాగుపై రాష్ట్రవ్యాప్తంగా రైతులకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని వ్యవసాయ నిపుణులు, శాస్త్రవేత్తలు ప్రభుత్వానికి సూచించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన సోమవారం ప్రజా భవన్‌లో కేబినెట్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ ఉన్నత స్థాయి సమీక్షా సమావేశానికి మంత్రులు డి. శ్రీధర్ బాబు, ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు హాజరయ్యారు. రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తి, ధాన్యం కొనుగోలు కార్యకలాపాలు, నిల్వ సదుపాయాలు మరియు వానకాలం సాగు సన్నద్ధతపై కమిటీ అత్యంత లోతుగా సమీక్ష నిర్వహించింది. ఈ సందర్భంగా సమావేశంలో పాల్గొన్న వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆచార్యులు, శాస్త్రవేత్తలు పలు కీలక ప్రతిపాదనలను మంత్రుల ఉప సంఘం దృష్టికి తీసుకువచ్చారు.

**రైతులకు లాభసాటి..**

విదేశాల్లో విపరీతమైన క్రేజ్ రైతులకు ఆర్థికంగా ఎంతో లాభదాయకమైన, అలాగే విదేశీ ఎగుమతులకు అత్యంత అనుకూలమైన BPT 5204, తెలంగాణ సోనా (RNR 15048), KNM1638, జై శ్రీరామ్, హెచ్ఎంటీ, WGL 962, WGL 44, JGL 1798 అనే 8 రకాల ప్రత్యేక వంగడాలను రైతులు పెద్ద ఎత్తున సాగు చేసుకునేలా ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. ఈ రకాలను సాగు చేయడం వల్ల మార్కెట్లో తిరుగులేని డిమాండ్ లభిస్తుందని వివరించారు. ముఖ్యంగా అమెరికా, ఆస్ట్రేలియా, యూరప్ దేశాలలో ఈ బియ్యానికి విపరీతమైన ఆదరణ ఉందని, దీనివల్ల ప్రభుత్వ మద్దతు ధర కంటే చాలా ఎక్కువ ధర పలికే అవకాశం ఉందని కేబినెట్ కమిటీకి నివేదించారు. ఈ మేలు రకం విత్తనాల కొరత రాష్ట్రంలో అస్సలు లేదని, కాబట్టి సాగును విస్తృతం చేయడం సులువని శాస్త్రవేత్తలు, వర్సిటీ వైస్ చాన్సలర్లు స్పష్టం చేశారు. అంతర్జాతీయ మార్కెట్ ధరల్లో వచ్చే ఒడిదొడుకుల (రిస్క్) నుండి రైతులకు పూర్తి రక్షణ లభించాలన్నా, వారి ఆదాయం గణనీయంగా పెరగాలన్నా ఈ 8 రకాల సాగు ఒక్కటే మార్గమని, ఇందుకోసం గ్రామ గ్రామాన ప్రత్యేక అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని సూచించారు.

**అన్ని సన్న రకాలకూ డిమాండ్ లేదు: పౌరసరఫరాల శాఖ**

రాష్ట్రంలో సాగు చేస్తున్న అన్ని రకాల సన్న బియ్యానికి మార్కెట్లో ఆదరణ లభించడం లేదని సివిల్ సప్లై అధికారులు మంత్రులకు వివరించారు. కొన్ని రకాల వరి ధాన్యాన్ని మిల్లింగ్ చేస్తున్నప్పుడు బియ్యం ఎక్కువగా విరిగిపోతుండటం (బ్రోకెన్ రైస్), వినియోగదారుల అభిరుచులకు తగ్గట్టుగా అవి లేకపోవడంతో మిల్లర్లు, వ్యాపారులు వాటిని కొనుగోలు చేయడానికి ఇష్టపడటం లేదని పేర్కొన్నారు. అందువల్ల, భవిష్యత్తులో కేవలం వినియోగదారులు, మిల్లర్లు, వ్యాపారులకు ఇష్టమైన.. డిమాండ్ లేని రకాల సాగును క్రమంగా తగ్గించడం మంచిదని అభిప్రాయపడ్డారు.

# మద్దతు ధర ఆశ చూపించి రైతులకు అన్యాయం

- కేంద్రంపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**హైదరాబాద్, జూన్ 15 (వుదయం) :**

కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)కు పంటలను కొనుగోలు చేస్తామని ప్రగల్భాలు పలికిన కేంద్ర ప్రభుత్వం.. క్షేత్రస్థాయిలో ఎందుకు కొనుగోళ్లు చేపట్టడం లేదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిలదీశారు. కేంద్రం ప్రకటించిన మద్దతు ధరలు వస్తాయనే నమ్మకంతో, ఎంతో ఆశగా పెట్టుబడులు పెట్టి సాగు చేసిన రైతులకు ప్రస్తుత పరిస్థితుల్లో తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని టీజీ మార్క్‌ఫెడ్ (TG MARKFED) కార్యాలయంలో మొక్కజొన్న కొనుగోళ్లు, తాజా పరిస్థితులపై ఉన్నతాధికారులతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం అత్యవసర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మార్కెట్లో రైతులకు అండగా నిలవాల్సిన బాధ్యత కేంద్రానిదేనని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇప్పటివరకు సేకరించిన మొక్కజొన్న పంటలను కాలయాపన చేయకుండా, కేంద్ర ప్రభుత్వం తక్షణమే పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అన్నదాతలకు నష్టం జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు.

## వైఫల్యాలను కప్పిపుచ్చుకోడానికే నిందలు




**హైదరాబాద్, జూన్ 15 (వుదయం) :**

హైదరాబాద్ మెట్రో రైల్ రెండో దశకు కేంద్రం నుండి అనుమతులు సాధించడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘోరంగా విఫలమయ్యారని, ఇది ఆయన అసమర్థ పాలనకు నిదర్శనమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తర్వాత 71 సార్లు ఢిల్లీకి వెళ్లినా.. బీజేపీ ప్రభుత్వం ఆయనను అస్సలు పట్టించుకోవడం లేదన్నారు. ఈ మేరకు బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా వేదికగా 'ఎక్స్' (ట్విట్టర్)లో ఒక ప్రకటన విడుదల చేసింది.

ప్రధానిని ప్రశ్నించలేక ప్రతిపక్షంపై నిందలు తెలంగాణ ప్రయోజనాల విషయంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీని నేరుగా ప్రశ్నించే ధైర్యం లేకనే.. సీఎం రేవంత్ రెడ్డి తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రతిపక్షాలపై నిందలు వేసే ప్రయత్నం చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. మెట్రో రెండో దశను సాధించడంలో అట్టర్‌ఫ్లాప్ అయినందుకు, అలాగే విజయవంతంగా నడుస్తున్న మొదటి దశను ఆగం చేస్తున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే రాష్ట్ర ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

మెట్రోను పూర్తి చేసిన ఘనత కేసీఆర్‌దే హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టును పూర్తి చేసిన ఘనత ముమ్మాటికీ కేసీఆర్‌దేనని కేటీఆర్ స్పష్టం చేశారు. నాడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 28 శాతం పనులను కూడా పూర్తి చేయకుండా ప్రాజెక్టును తీవ్ర వివాదాల్లో, చిక్కుల్లో వదిలేసిందని విమర్శించారు. 2014లో బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే, కేసీఆర్ ప్రత్యేక చొరవ తీసుకుని నిధులు సమకూర్చి, మిగిలిన 72 శాతం పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయించారని గుర్తు చేశారు.

స్వార్థ ప్రయోజనాల కోసమే రూట్ల మార్పు గత బీఆర్ఎస్ ప్రభుత్వం నగరంలో ట్రాఫిక్ రద్దీ, భవిష్యత్ విస్తరణ మరియు ప్రజల రోజువారీ అవసరాలను శాస్త్రీయంగా పరిశీలించి మెట్రో రెండో దశను ప్రతిపాదించిందని కేటీఆర్ తెలిపారు. కానీ, రేవంత్ రెడ్డి కేవలం తన స్వార్థ ప్రయోజనాల కోసం, రియల్ ఎస్టేట్ దందాల కోసం ఉనికిలో లేని ఒక ఊహాజనిత నగరానికి మెట్రో రెండో దశ రూట్లను మార్చారని ఆరోపించారు. ఎల్‌అండ్‌టీ (L&T) సంస్థపై ప్రభుత్వం చేస్తున్న బెదిరింపులు, వారి ఆస్తులను కొల్లగొట్టే కుట్రల వల్లే భయపడి ఆ సంస్థ ప్రాజెక్టు నుండి తప్పుకుంటోందని కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు.

## హర్మ్యూజ్ జలసంధిపై ఎత్తివేత

**న్యూఢిల్లీ, జూన్ 15 (ఎంఎస్) :**

దీర్ఘకాలంగా పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలకు కారణమైన అమెరికాఇరాన్ వివాదం ఎట్టకేలకు శాంతి ఒప్పందం దిశగా అడుగులు వేయడంపై భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఇరుదేశాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలను ముగించేందుకు ఉభయ పక్షాలు ఒక అంగీకారానికి రావడాన్ని భారత్ పూర్ణాత్మకంగా స్వాగతిస్తోందని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు ప్రధాని మోదీ సామాజిక మాధ్యమం 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా ఒక ప్రత్యేక సందేశాన్ని పంచుకున్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలకు ఊరట "పశ్చిమాసియాలో చోటుచేసుకున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల ఆర్థిక వ్యవస్థలపై తీవ్ర ప్రతికూల ప్రభావం పడింది. ఎంతోమంది అమాయకులు ప్రాణాలు కోల్పోయారు. ఈ సుదీర్ఘ ఘర్షణకు తెరదించేలా అమెరికా, ఇరాన్‌లు ఒక అంగీకారానికి రావడం అత్యంత శుభపరిణామం. పశ్చిమాసియా ప్రాంతంలో శాంతి, స్థిరత్వాలను పునరుద్ధరించడంతో పాటు



అంతర్జాతీయ జలాల్లో స్వేచ్ఛా నౌకాయానం, అంతరాయం లేని వాణిజ్యానికి భరోసా కల్పించడంలో ఈ ఒప్పందం కీలక పాత్ర పోషిస్తుందని భారత్ బలంగా విశ్వసిస్తోంది. భవిష్యత్తులో మరింత సుస్థిరమైన తుది ఒప్పందానికి దారితీసేలా.. మిగిలిన పెండింగ్ అంశాల పైనా ఇరుదేశాల మధ్య సానుకూల చర్చలు కొనసాగుతాయని ఆశిస్తున్నాం" అని ప్రధాని మోదీ తన పోస్ట్‌లో పేర్కొన్నారు జూన్ 19న అధికారికంగా సంతకాలు పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణాన్ని ముగించేలా ఇరాన్‌తో చారిత్రాత్మక ఒప్పందం కుదిరిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే అధికారికంగా ప్రకటించగా, ఇరాన్ రాజధాని టెహ్రాన్ సైతం ఈ పరిణామాన్ని ధ్రువీకరించింది.

# ఇరాన్ డిమాండ్లు మాకు రెడ్ లైన్స్

**జెరూసలెం:**

జెరూసలెం/టెహ్రాన్ (అంతర్జాతీయ వార్తా విభాగం): పశ్చిమాసియాలో శాంతి అమెరికాఇరాన్‌ల మధ్య చారిత్రాత్మక డీల్ కుదిరేందుకు సర్వం సిద్ధమైన వేళ.. ఇజ్రాయెల్ ఇందుకు తీవ్ర అడ్డంకిగా మారింది. లెబనాన్‌పై దాడులు పూర్తిగా నిలిపివేస్తేనే తాము ఒప్పందానికి కట్టుబడి ఉంటామని ఇరాన్ (టెహ్రాన్) స్పష్టం చేసినప్పటికీ.. ఇజ్రాయెల్ రక్షణ దళాలు) మాత్రం లెబనాన్‌పై క్షిపణులతో విరుచుకుపడుతూనే ఉన్నాయి. భూభాగాల నుంచి వైదొలిగేది లేదు: రక్షణ మంత్రి కాట్జ్ అమెరికాఇరాన్ మధ్య ఒప్పందం ఇంకా తుది దశకు చేరనందున, గాజా, సిరియా, లెబనాన్‌లలో తాము స్వాధీనం చేసుకున్న ఏ ఒక్క భూభాగం నుండి కూడా వైదొలిగే ప్రసక్తే లేదని ఇజ్రాయెల్ రక్షణ మంత్రి కాట్జ్ ఖచ్చితంగా ప్రకటించారు. హెజ్‌బొల్లా స్థావరాలపై తాము చేస్తున్న దాడులకు ప్రతీకారంగా ఇరాన్ గనుక నేరుగా దాడులకు తెగబడితే, పశ్చిమాసియాలో మళ్లీ తీవ్ర యుద్ధ పరిస్థితులు నెలకొంటాయని ఆయన హెచ్చరించారు. ఇజ్రాయెల్ సార్వభౌమాధికారానికి, స్వేచ్ఛకు భంగం కలిగించేలా ఇరాన్ చేసే ఏ డిమాండ్‌నైనా తాము 'రెడ్ లైన్' (లక్ష్మణ రేఖ)గానే పరిగణిస్తామని కాట్జ్ స్పష్టం చేశారు.



